



# విజయభాను






విశాఖపట్నం, శనివారం 06-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 23 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బలపడిన 'క్షిపణి' బంధం

- అంతరిక్ష రంగంలో సహకారం
- రక్షా, భారతదేశానికి కీలక మిత్రదేశం
- ఉగ్రవాదం సహా పలు కీలక అంశాలపై చర్చ
- మోదీ-పుతిన్ మీడియా సంయుక్త సమావేశం



న్యూఢిల్లీ: రష్యాతో భారత్ 'క్షిపణి' బంధం మరింత బలపడింది. ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ కొనుగోలు ఒప్పందంపై రెండు దేశాల మధ్య శుక్రవారం సంతకాలు జరిగాయి. రెండ్రోజుల పర్యటనకు గురువారం ఇక్కడకు వచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భారత్-రష్యా 19వ వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం శుక్రవారం నాడిక్కడ హైదరాబాద్ హౌస్‌లో జరిగింది. ఈ సమావేశంలో 5.43 బిలియన్ డాలర్లు (రూ.40,000 కోట్లు) విలువైన ఎస్-400 మిస్సైల్స్ కొనుగోలుకు సంబంధించి రష్యాతో భారత్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రష్యా నుంచి ఎస్-400ను కొనుగోలు చేయొద్దని అమెరికా ఆంక్షలు విధిస్తున్నప్పటికీ భారత్ కొనుగోలు ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లింది.

ఒప్పందంపై సంతకాల అనంతరం మోదీ-పుతిన్ మీడియా సంయుక్త సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఎనిమిది కీలక ఒప్పందాలపై ఉభయ దేశాలు సంతకాలు చేసినట్టు తెలిపారు. అంతరిక్ష రంగంలో పరస్పరం సహకరించుకోవాలనే తరువాయి 2లో..

## ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



అమరావతిః రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా కారెం శివాజీ నియామకం విషయంలో ఏపీ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. చైర్మన్ నియామకంపై చంద్రబాబు ప్రభుత్వానికి హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీచేసింది. ఇటీవల ఏపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా కారెం శివాజీని నియమించిన విషయం తెలిసిందే. తరువాయి 2లో..

## ఐదు రాష్ట్రాల సీఈవోలతో సీఈసీ భేటీ




న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల సీఈవోలతో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ కూడా పాల్గొన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో సమావేశానికి మరింత ప్రాధాన్యత పెరిగింది. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా, ఈవీఎంలు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. కాగా, మరికొద్ది రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి రానున్నట్లు తెలుస్తోంది.

### విజయవాడలో ముమ్మరంగా

## ఐటీ సోదాలు

**మూడు సంస్థల్లో ఆదాయపన్ను అధికారుల తనిఖీలు**

**రాజకీయ నేతలపై దాడులనడాన్ని ఖండిస్తాం**




విజయవాడ: విజయవాడ నగరంలో మూడు చోట్ల ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన సదరన్ డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కార్యాలయంతో పాటు సంస్థ ప్రతినిధుల నివాసాల్లోనూ సోదాలు చేపట్టారు. గుంటూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డీఎస్ లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధుల నివాసాలు, కార్యాలయాలపై కూడా ఐటీ సోదాలు జరుగుతున్నాయి.

ఉదయం ఏడున్నర గంటలకు ఐటీ అధికారులు సోదాలు ప్రారంభించారు. రాజకీయ నేతలపై ఈ సోదాలు జరుగుతాయంటూ తరువాయి 2లో..

## ఉప ఎన్నికకు అవకాశం..?

**మూర్తి మృతితో ఖాళీ అయిన స్థానం**



విశాఖపట్నం: ఎమ్మెల్సీ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో మండలిలో విశాఖ నుంచి స్థానిక సంస్థల కోటాలో ఒక స్థానం ఖాళీ కానుంది. దీనికి ఉప ఎన్నిక నిర్వహించే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నాయి. మూర్తి 2015 జూన్‌లో స్థానిక సంస్థల కోటా కింద తరువాయి 2లో..



## కేసీఆర్‌కు ఓటమి భయం

- వ్యక్తుల్ని కించపరచడం కేసీఆర్ నైజం
- ఏపీ మంత్రి నారాయణ

విజయవాడ: ఓటమి భయంతోనే కేసీఆర్ చంద్రబాబుని టార్గెట్ చేశారని ఏపీ మంత్రి నారాయణ ఆరోపించారు.

కేసీఆర్‌కి నోటి దురద ఎక్కువై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వ్యక్తుల్ని కించపరచడం కేసీఆర్ నైజం అని మండిపడ్డారు. జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఎక్కడికైనా వెళ్తారన్నారు. రాజకీయ కోణంలోనే ఏపీలో ఐటీ దాడులు జరుగుతున్నాయని తెలిపారు.

బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా ఐటీ దాడులు చేయిస్తున్నారని విమర్శించారు.

ఇలాంటి చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే విషయం తెలుసుకోవాలని మంత్రి సూచించారు.





### డెనిస్, నదియా మురద్‌లకు

## నోబెల్ శాంతి బహుమతి

నార్వే : ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి ఈ ఏడాది ఇద్దరిని వరించింది. డెనిస్ ముక్‌వెగె, నదియా మురద్‌లకు సంయుక్తంగా ఈ బహుమతి దక్కింది. లైంగిక హింసను అరికట్టేందుకు చేసిన కృషికి, లైంగిక దాడి బాధితులకు చేసిన సహాయానికి గాను నోబెల్ శాంతి బహుమతి లభించింది. నోబెల్ శాంతి బహుమతి కోసం 331 నామినేషన్లు(216 మంది వ్యక్తులు, 115 సంస్థలు) రాగా ఈ ఇద్దరికి అవార్డు వరించింది. వీరికి 9మిలియన్ల స్వీడిష్ల క్రోనోర్(1.01మిలియన్ డాలర్లు) బహుమతిగా అందనుంది.

డెనిస్ మక్‌వెగె కాంగోకు చెందిన గైనకాలజిస్టు. ఆయన లైంగిక హింస బాధితులకు సహాయం చేశారు. నదియా మురద్ ఇరాక్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త. ఆమె యాజిదీ తరువాయి 2లో..

## కేంద్రానివి కుట్రపూరిత దాడులు

- ఏపీలో ఏం జరుగుతోంది!?
- నారాయణ విద్యా సంస్థల్లోనూ కొనసాగుతున్న దాడులు
- ఐటీ దాడుల నేపథ్యంలో మంత్రులతో సీఎం భేటీ



అమరావతి: ఏపీ కేబినెట్ సమావేశంలో శుక్రవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరుగుతున్న ఆదాయ పన్ను శాఖ దాడులపై వాడిగా వేడిగా చర్చ సాగింది. అలాగే, తెలంగాణలో ముందస్తు ఎన్నికలు, కేసీఆర్ వ్యాఖ్యలు, రెండు తెలుగు రాష్ట్రాల్లో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీసీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.

**నారాయణ విద్యాసంస్థలపై ఐటీ దాడులు?**

కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగానే ఐటీ దాడులు చేస్తోందని ఆరోపించారు. ఇది రాష్ట్రంపై జరిగిన దాడిగా చూడాలని కేబినెట్ అభిప్రాయపడింది. ఐటీ దాడులపై అమీతుమీకి సిద్ధపడింది. ఐటీ దాడుల వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు మంత్రులు... చంద్రబాబును అడిగారు. అంతటా ఇదే స్కెచ్, ఈ రాజకీయ దాడులకు మద్దతిచ్చేది లేదు. దానికి చంద్రబాబు స్పందించారు. ఎన్నికలకు ముందు అన్ని రాష్ట్రాలలోను ఇదే తరహా స్కెచ్ వేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కర్ణాటక ఎన్నికలకు ముందు జరిగిన అంశాన్ని గుర్తు చేశారని తెలుస్తోంది. ఇది ప్రజాస్వామ్యమేనా? అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ చేసే రాజకీయ దాడులకు మద్దతిచ్చేది లేదని తేల్చి చెప్పారు.

**ఐటీ అధికారులకు సెక్యూరిటీ విత్ డ్రా చేసే యోచన**

ఒకేసారి ఇలా దాడులు నిర్వహించాల్సిన అవసరం ఏముందని చంద్రబాబు కేబినెట్ భేటీలో వ్యాఖ్యానించారు. లా అండ్ ఆర్డర్ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయని చెప్పారు. ఐటీ అధికారులకు కూడా సెక్యూరిటీ విత్ డ్రా చేసుకునే అంశంపై యోచిస్తున్నట్లుగా చెప్పారు. ఐటీ దాడులకు వచ్చిన వారికి ఇచ్చిన సెక్యూరిటీ విత్ డ్రా చేసుకోవాలని పలువురు మంత్రులు సూచించారని తెలుస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై సుప్రీం కోర్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు దెబ్బతీస్తున్నారనే అంశంతో సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశాలను కూడా పరిశీలించాలని లా సెక్రటరీకి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అన్నింటికి సిద్ధంగా ఉండాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి తరువాయి 2లో..




# తాగునీటి ఎద్దడికి ఎమ్మెల్యే బాధ్యత పడాలి

## వైయస్సార్ నేత అవనాపు విక్రమ్



విజయనగరం: పట్టణంలోని 20 వార్డుల పరిధిలో ఉన్న ప్రజలు త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న పరిస్థితికి పురపాలక పాలకవర్గంతో పాటు స్థానిక శాసనసభ్యురాలు బాద్యత వహించాలని విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం వైయస్సార్. కాంగ్రెస్ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ ఆరోపించారు. శుక్రవారం అవనాపు విక్రమ్ నాయకత్వంలో వైకాపా కౌన్సిలర్లు , పార్టీనాయకులు ముషిడిపల్లి నీటి సరఫరా పంపుహౌస్, నీటినిల్వ బావులను పరిశీలించిన తరువాత వారు మాట్లాడారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ పట్టణ జనాభా త్రాగునీటి అవసరాలకు ముషిడిపల్లి వాటర్ సరఫరా కేంద్రంనుండి రోజుకు 40 మిలియన్ల లీటర్లు నీరు సరఫరా కావలసి ఉండగా కేవలం 9 మిలియన్ల లీటర్లు నీరు సరఫరా జరుగుతుందని నెల్లిమర్ల పంపుహౌస్ నుండి 7 మిలియన్ల లీటర్లు వస్తుందని రెండూ కలిపి 16ఎమ్.ఎల్.డిల నీరు సరఫరా పట్టణ ప్రజలకు ఏమాత్రం చాలని త్రాగునీరు ప్రజలు త్రాగు నీటికి కటకట లాడుతున్నారన్నారు. వేసవి రాకముందే పట్టణానికి నీరు అందని పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ప్రజల పరిస్థితిఎలాఉంటుందో ఊహించడానికే భయంగా ఉందని విక్రమ్ ఆందోళన వ్యక్తం చేశారు.గజపతినగరం నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు, ప్రజా ప్రతి నిధులు ముషిడిపల్లి నీటిని వారి నియోజకవర్గం రైతులకు మల్లించుకున్నందునే ఈ పరిస్థితి దాపురించందని ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యేగాని , మ్యున్సిపల్ చైర్మన్లు ముందుగా స్పందించక పోవడం దారుణమన్నారు. 1994లో తమ నాయకుడు నాటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ముషిడిపల్లి నీటి పథకాన్ని ప్రారంబించారని గొప్పలు చెప్పుకుంటున్న తెలుగుదేశం ప్రజాప్రతినిధులు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీరు సమస్యపై ఎందుకు మాట్లాడరని విక్రమ్ నిలదీశారు.మరో 15రోజుల్లో పైడితల్లి అమ్మవారి జాతర జరుగనున్నందున జాతరకు వచ్చే ప్రజలు, చుట్టాలు బంధువులతో పట్టణ ప్రజలు త్రాగునీటికి అవస్థలు పడరా అని ఆయన ప్రశ్నించారు. పురపాలక సంఘం పాలకవర్గం అధికారులు, స్థానిక శాసనసభ్యురాలు నిర్లక్ష్య ఫలితంగా ప్రజలు త్రాగునీరుకు ఇబ్బంది పడుతున్నందున కలక్టరు వెంటనే జోక్యం చేసుకొని ప్రజల అవసరాలకు అవసరమయ్యే త్రాగునీరు సరఫరాలకు చర్యలు తీసుకోవాలని , దానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని అవనాపు విక్రమ్ హామీ ఇచ్చారు. వై.కా.పా. కౌన్సిలర్లు గాడు అప్పారావు, పిల్లా పద్మావతి, పిలకా దేవి, గంటా చినతల్లి, మాజీ కౌన్సిలర్లు పిన్నింటి చంద్రమౌళి, మంచాల శివానీ, పార్టీ నాయకులు చందక వెంకటరమణ, ముళ్ల త్రినాధ్, పిల్లా రామకృష్ణ, పిలకా శ్రీను, ప్రసాద్ ప్రభూ, కంది అప్పారావు, గంటా సూర్యారావు, రెడ్డి రాము, రౌతుశ్రీనివాసరావు, దత్తి సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మేలు జరగాలి

## విజయనగరం జిల్లా కలెక్టర్ డా. ఎం. హరి జవ హర్‌లాల్



విజయనగరం: నీటిపారుదల శాఖ ద్వారా చేపడుతున్న ప్రతిపని రైతులకు మేలు జరిగే విధంగా ఉండాలనిజిల్లా కలెక్లర్ డా.ఎం.హరి జవ హర్‌లాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ సమావేశభ వన్‌లో నీటిపారుదల వాఖ పనులను సమీక్షించారు. జిల్లా రైతులను ఆదుకునే విధంగా పనులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఎకరాకు నీరు అందించాలే ప్రణాళిక ఉండాలన్నారు. భారీ, మధ్యతరగతి, చిన్నతరహా నీటి ప్రాజక్టులు ఎప్పల్పుడు సమీక్షించుకుంటూ త్వరితగతిన పనులు పూరిత్తిచేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన చెక్‌డామ్ పనులు, నీరుచెట్టు, చెరువుల అనుసంధానం కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. జంఝావతి ,తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా అదనపు ఆయకట్టుకు, తారకరామతీర్ధసాగర్ క్రింద సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బేలన్సింగ్ రిజర్వాయరుకల పనులు పూర్తిచేయాలని, చెక్‌డ్యామ్‌లు, వర్క్యులేషన్ ట్యాంకులు అవసరమైన చోట నిర్మించాలని పనులు పూర్తి అయినన వాటికి నిధులు వెంటనే మంజూరు అయితే కాంట్రాక్టర్లు ఇంకా పనులు వేతవంతం చేస్తారని అన్నారు. ఎఇలు పుల వారీగా,మండలాల్లో పనులు నివేదించారు. అధికారికంగా ప్రతివారం ర్యాంక్‌లు ఇవ్వడం జరుగుతుందని, లోర్యాంక్ వచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. బాగా పనిచేసే ఎక్మలకు నగదు బహుమతులతో పాటు ఘనంగా సత్కరించడం జరుగుతుందని కలక్టర& ప్రకటించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఇ. నాగేశ్వరరావు, తారకరామతీర్ధ సాగర్, గడిగెడ్డి, విజయనగరం ఇర్‌డిఓ జె.వి.మురళి, ఇఇలు, డిఇలు రామచంద్రరావు, రమణారావు తదితరు లు పాల్గొన్నారు.

# నవ్య సమాజానికి మార్గదర్శి, దిక్సూచి గురువు

## మహారాజా మహిళాకళాశాల ప్రిన్సిపల్ సరస్వతి



విజయనగరం: నవ్య సమాజానికి మార్గదర్శి, దిక్సూచి గురువు అని మహారాజా మహిళాకళాశాల ప్రిన్సిపల్ ఎం.సరస్వతి అన్నారు. ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ అధ్యయన వైశాల్యం, దృక్పధంలో శాస్త్రీయత, పరిపక్వ అవగాహన, లోతైన ఆలోచన, మూర్తీభవించిన ఆచార్యులు నేటి సమాజానికి అవసరమని, బాలికలకు చదువెందుకని ప్రశ్నించిన చోట కేవలం వారికోసమే ఐదు పాఠశాలలను స్థాపించిన సావిత్రీబాయి పూలేని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, మూగ బధిరులకు జీవన విద్య నేర్పించిన మహోన్నత ఉపాధ్యాయి అన్నే సల్లెవన్ వంటి వారు సమాజానికి అవసరమని అన్నారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్, కేబినెట్ సెక్రటరీ పిన్నింటి సూర్యనారాయణలు సరస్వతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు సుభద్రాదేవి, చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు ముడిదాపు రాము, డాక్టర్ పి.జయలక్ష్మి, తెలుగు విభాగానికి చెందిన సూర్యకాంతి, డాక్టర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ యూనివర్సిటీకి స్పందన

## ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం డయల్



ఆంధ్రవిశ్వవిద్యాలయం : యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ వీసీ ఆచార్యజి.నాగేశ్వర రావు స్వయంగా విద్యార్థుల సందేహాలకు సమాధాన మిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ప్రవేశాల సంచాలకులు ఆచార్య నిమ్మ వెంకట రావు, డీన్‌లు పి.హరి ప్రకాష్, డి.పుల్లారావు, కె.చంద్రమౌళి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు....**

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావును వర్సిటీ ఆచార్యులు అభినందించారు. ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావును కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రవేశాల సంచాలకులు ఆచార్య నిమ్మ వెంకట రావు, అకడమిక్ డీన్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, డీన్‌లు పి.హరి ప్రకాష్, డి.పుల్లారావు, కె.చంద్రమౌళి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దసరా నవరాత్రి మహోత్సవాలకు పందిరి రాట



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం మధురవాడ స్వతంత్రనగర్ లో దసరా మహోత్సవాల సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన పందిరి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోతిన నానాజీ, అనురాధ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం దంపతలు పందిరి రాటను వేసారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు బండయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా లక్ష్మీదేవి అమ్మవారి ఆలయం వద్ద దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుంటుబోయిన సంజీవ్ యాదవ్, బాలు పాత్ర మరియు కమిటీ సభ్యులు అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నీరుగారుస్తున్నారు : కాంగ్రెస్ ఆరోపణ



విజయనగరం: కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో దేశం పార్టీ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నీరుగారుస్తున్నాయని 2014, 15, 16, 17, 2018 సుమారు 20 కోట్లు ఎస్సీ, ఎస్టీ నిధులు ఖర్చు చేయకపోవడం దారుణమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ బొంగ భానుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటి కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా స్థానిక జొన్నగుడ్డి, రుస్సావీధి, పెద్దవీధి, రెల్లివీధుల్లో ప్రచార క్యాక్రమం చేశారు. సామాజిక న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోటే సాధ్యమన్నారు. ఈకారకయక్రమంలో లావేలి రామకృష్ణ, జి.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, ఎ.మధు భోగాపురపు పాపారావు, కోట్ల మోహన్ రావు, మురళీ వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి

విజయనగరం: ఓటరు దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోపు వచ్చే శనివారం, ఆదివారం తీసుకోవడానికి ప్రత్యేక దినాలుగా గుర్తించారని జిల్లా కలెక్లర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ తెలిపారు. ఈ నెల 6, 13, 20, 27 తేదీలు నాలుగు శనివారాలు, ఈనెల 7, 14, 21, 28 నాలుగు ఆదివారాలు ప్రతి బిఎల్‌ఓ తమ పోలింగ్ స్టేషన్ వద్ద నిర్ణీత ఫారాల్లో ఉంటారని తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

**మొదటి పేజీ తరువాయి**

## బలపడిన 'క్షిపణి' బంధం

ఒప్పందం కూడా ఇందులో కీలంగా ఉంది. రష్యా భారతదేశానికి కీలక మిత్రదేశమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా కొనియాడారు. ఇరుదేశాలు సహజ భాగస్వామ్యులని అన్నారు. భారత దేశ అభివృద్ధిలో రష్యా పాత్ర ఎప్పుడూ ఉంటూనే ఉందని అన్నారు. తాజాగా చేసుకున్న పలు ఒప్పందాలతో ఈ సంబంధాలు కొత్త పుంతలు తొక్కినట్టు పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో సహకారానికి ముందుకు వచ్చిన రష్యాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇస్రో మ్యాన్డ్ మిషన్‌కు రష్యా సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా రైల్వేలు, అంతరిక్షం, న్యూక్లియర్ తదితర రంగాలకు సంబంధించి ఇరుదేశాల మధ్య కుదిరిన ఎంఓయూలను ఇరుదేశాల అధికారులు మార్చుకున్నారు. ఇరు దేశాల మధ్య అంతరిక్ష రంగంలో పరస్పర సహకారానికి కుదిరిన ఒప్పందంలో భాగంగా సైబీరియాలోని నోవోసైబిర్స్క్ నగరం సమీపంలో భారత్ పర్యవేక్షణ కేంద్రాన్ని నిర్మించనుంది.

ముఖ్య అతిథిగా మోదీకి పుతిన్ ఆహ్వానం

మీడియాతో జరిగిన సంయుక్త సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీని తదుపరి శిఖరాగ్ర సమావేశం జరగనున్న వ్లాదివోస్టోక్ ఫోరమ్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానిస్తున్నానని అన్నారు. ఉగ్రవాదం సహా పలు కీలక అంశాలపై మోదీతో చర్చించామని, పరస్పర సహకారం విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నామని అన్నారు. పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా చర్చించామని, రక్షణ ఒప్పందాల విస్తృతికి, పరస్పర వ్యూహాత్మక సంబంధాలు బలపరచుకునేందుకు, ఇండియా ఇంధన అసరాలకు సహకరించేందుకు కూడా రష్యా కట్టుబడి ఉందని అన్నారు.

## ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

అయితే శివాజీ ఎన్నిక చెల్లదంటూ న్యాయవాది హరిప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారించిన ఉమ్మడి హైకోర్టు చంద్రబాబు సర్కార్‌కు నోటీసులు జారీచేసింది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ నియామక పక్రియకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని నోటీసులలో హైకోర్టు ఆదేశించింది. కమిషన్ చైర్మన్ కారెం శివాజీ అక్టోబర్ 31న నేరుగా హైకోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది.

కారెం శివాజీ ఎంపిక, నియామకం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఆదేశించిన విషయాలను పిటిషన్‌లో ప్రస్తావించారు. ఏపీ ప్రభుత్వం శివాజీని తిరిగి కమిషన్ చైర్మన్‌గా నియమించడం హైకోర్టు ఆదేశాలను ఉల్లఘించినట్లేనని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటూ కంటెంప్ట్ ఆఫ్ కోర్టు ప్రకారం లాయర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## విజయవాడలో ముమ్మరంగా ఐటీ సోదాలు

పెద్దయెత్తున ప్రచారం జరిగినా ఐటీ అధికారులు వాటిని ఖండించారు. కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలో ఉన్న ప్రీకాస్టింగ్, ఇటుకల తయారీ కంపెనీపై కూడా ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. మొత్తం 7 బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు గుంటూరు, విజయవాడ, కృష్ణా జిల్లాలో ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఐటీ సోదాలు జరుగుతాయంటూ ప్రచారం జరగడంతో పాటు రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరగవచ్చంటూ ఊహాగానాలు చెలరేగాయి. అయితే ఐటీ శాఖ మాత్రం ఈ వదంతులు అవాస్తవమని తేల్చిచెప్పింది. ఐటీ దాడులకు ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచారం లీకయ్యే అవకాశం లేదని ముఖ్యులైన అధికారులు మినహా సోదాల్లో పాల్గొనే వారికి సైతం ఈ దాడుల వివరాలు తెలియవని వారు స్పష్టంచేశారు. ఓ కార్పొరేట్ విద్యాసంస్థపై దాడులు జరుగుతున్నాయంటూ జరిగిన ప్రచారాన్ని ఐటీ అధికారులు కొట్టిపడేశారు.

## ఉప ఎన్నికకు అవకాశం..?

ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అప్పట్లో జిల్లాలో స్థానిక సంస్థల కోటా కింద రెండు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అభ్యర్థుల ఎంపికపై జిల్లా నేతలతో చర్చించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనూహ్యంగా చివరి నిమిషంలో మూర్తి పేరు ఖరారు చేశారు. అప్పట్లో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. 2015 జులైలో శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. మూర్తి మండలి సభ్యత్వ కాల పరిమితి నాలుగేళ్లు. వచ్చే సంవత్సరం జులైతో కాలపరిమితి ముగియబోతోంది. అంటే ఇంకా దాదాపు 10 నెలల సమయం ఉంది. సాధారణంగా శాసనసభ స్థానానికి గడువుకు ఏడాదిలోపు ఖాళీ అయితే ఉప ఎన్నిక నిర్వహించరు. శాసనమండలి స్థానం కావడం, ఎమ్మెల్సీని ఎన్నుకునే స్థానిక సంస్థల సభ్యుల కాలపరిమితి వచ్చే జులై వరకు ఉన్నందున ఉప ఎన్నిక రావొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. సెప్టెంబరు 23న మావోయిస్టుల కాల్పుల్లో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికలకు 9 నెలలు మాత్రమే గడువు ఉన్నందున ఆ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేదు. జిల్లాలో కేవలం పది రోజుల వ్యవధిలో ఒక శాసనసభ, ఒక శాసనమండలి స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి.

## డెనిస్, నదియా మురద్‌లకు నోబెల్ శాంతి బహుమతి

తెగకు చెందిన యువతి. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల కారణంగా తనపై జరిగిన లైంగిక హింసను, ఇతర యాజిదీ యువతులు అనుభవిస్తున్న నరకం గురించి ప్రపంచానికి తెలియజేశారు. యాజిది యువతులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు పాటుపడ్డారు. యుద్ధాల్లో లైంగిక హింసను ఆయుధంగా ఉపయోగించడాన్ని నిర్మూలించేందుకు డెనిస్, నదియా మురద్‌లు చేసిన కృషికి నోబెల్ శాంతి బహుమతితో గుర్తింపు లభించింది.

## కేంద్రానివి కుట్రపూరిత దాడులు

సూచించారు. మూకుమ్మడి దాడులతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కీలక నిర్ణయాలు మొత్తంగా ఐటీ దాడుల నేపథ్యంలో కేబినెట్లో కీలక చర్చ జరిగింది. ఒకటి ఐటీ దాడులను రాష్ట్రంపై దాడిగా చూడాలని కేబినెట్ అభిప్రాయపడింది. అలాగే, సుప్రీం కోర్టుకు వెళ్లాలని యోచిస్తున్నారు. మరోవైపు ఐటీ అధికారులకు సెక్యూరిటీ విత్ డ్రా చేసుకునే కీలక నిర్ణయాలు తీసుకునే యోచన చేస్తున్నారు. కేసీఆర్ చేసిన విమర్శలపై ఎలా స్పందించాలనే అంశంపై కూడా చర్చించారు.

# అయినా మాకు నష్టం లేదు

- మాయావతి 'ఒంటరి'.. - ఎలాంటి ప్రభావం చూపదు

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ధీమా

దిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఒంటరిగా పోటీ చేయడం కాంగ్రెస్‌పై ఎలాంటి ప్రభావాన్ని చూపించదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీ చేస్తుందని, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం లేదని ఇటీవల మాయావతి స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్, బీఎస్పీతో పొత్తు పెట్టుకోవాలని భావించింది కానీ సీట్ల పంపకంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మాయావతి పొత్తుకు అంగీకరించలేదు. మధ్యప్రదేశ్‌లో బీఎస్పీతో పొత్తు అంశం మాపై పెద్దగా ప్రభావాన్ని చూపదు అని రాహుల్ హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడుతూ అన్నారు. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం మంచిదని, ఈ రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పొత్తుల గురించి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. కేంద్రంలో, రాష్ట్రాల్లో పొత్తులు వేర్వేరు. మాయావతిజీ దాన్ని తెలియజేశారు. రాష్ట్రంలో మాకు అనుకూలత ఉంది. మేం చర్చల్లో ఉండగానే వాళ్లు వాళ్ల దారిలో వెళ్లాలని నిర్ణయించుకున్నారు అని రాహుల్ వెల్లడించారు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేసే అవకాశముందని, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఆ అవకాశం ఎక్కువగా ఉందని రాహుల్ అన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఇతర పార్టీలతో పొత్తుకు సుముఖంగా ఉన్నప్పటికీ ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు వ్యతిరేకంగా ఉన్నారని , ప్రయత్నాలను సఫలం కానివ్వట్లేదని మాయావతి ఆరోపించిన విషయం తెలిసిందే.

# నపుంసకుల కేసులో డేరా బాబాకు బెయిల్

పంచకుల: అత్యాచారం కేసుల్లో 20 ఏళ్ల జైలు శిక్షపడిన డేరా సచ్ఛా సౌధా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు 'కేస్టరేషన్' కేసులో పంచకుల సీబీఐ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. డేరా బాబా తన ఆశ్రమంలోని సుమారు 400 మంది భక్తులను నపుంసకులను చేసే శస్త్రచికిత్సలు చేయించారన్న ఆరోపణలకు సంబంధించిన కేసు ఇది.

ఈ కేసులోనే ఆయనకు కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది.

# పోలీసుల నిర్బంధ చర్యలను ఆపాలి

## గిరిజనులకు కలెక్టర్ భరోసా ఇవ్వాలి .. సిపిఎం డిమాండ్

అరకుః కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమల హత్య అనంతరం విచారణ పేరుతో అమాయక గిరిజనులను పోలీసులు అనేక యిబ్బందులు పెడుతున్నారని, అర్ధరాత్రి గ్రామాల్లో ఇళ్ళల మీద పడి పోలీసులమని బెదిరిస్తున్నారని, ఆ బెదిరింపు చర్యలను కలెక్టర్ జోక్యం చేసుకుని ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో పోలీసుల బూట్ల చప్పుళ్ళతో భయభ్రాంతులకు గురై నిద్రాహారాలు కరువై బిక్కుబిక్కుమని గిరిజనులుంటున్నారని అన్నారు. పగలు పూట వ్యవసాయ పనులకు, కొండల్లో కట్టెలు తెచ్చుకోవాడానికి వెళ్తున్న గిరిజనులను వేధింపులు తగదు. డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు, సర్రాయి, కంద్రుం, అంత్రిగుడ గ్రామాల్లో మరింత దారుణంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. గూడ క్వారీకి వ్యతిరేకంగా ఉద్యమించిన గ్రామస్తులను, డుంబ్రిగుడ విలేఖర్ల ఫోన్ నెంబర్లు ఇ-మెయిల్స్‌ను తీసుకొని విచారణ చేస్తున్నారు. గ్రామంలో ఉన్న ప్రజలందరినీ విచారణ పేరుతో పోలీసు స్టేషన్లకు పిలవడం, విచారణ పూర్తయ్యేవరకు ప్రజలందరూ ఎక్కడకూ వెళ్లకూడదనే హుకుంలు జారీచేయడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పోలీసుల ఈ నిర్భంధ చర్యలను విరమించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది.

ఇప్పటికే హత్య ఘటనకు సంబంధించి సిట్‌ను నియమించారు. సిట్ అధికారులు హత్యకు సంబంధించి ఎవరు చేయించారో విచారణ చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారి హస్తం ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా పార్టీలోకి కొత్తగా వచ్చిన వారే ఈ హత్య చేయించారని వాపోయారు. అధికార్లు, అధికార పార్టీ నేతలే బహిరంగంగా ఎవరెవరి పాత్ర ఉన్నదో తెలియజేస్తున్న తరుణంలో పోలీసులు ఈ పేరుతో అమాయకులైన గిరిజనులను విచారణ పేరుతో పిలిపించి యిబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. గిరిజనుల పక్షాన ఉంటానని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం నేడు దీనికి భిన్నంగా అమాయక గిరిజనులను వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు? ఇప్పటికైనా పోలీసులు గిరిజన గ్రామాల్లో నిర్భంద చర్యలను విరమించి ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. ఈ పోలీసు చర్యలను ప్రజాతంత్రవాదులు, మేధావుల, మానవ హక్కులు, పౌర హక్కుల సంఘాలు, అభ్యుదయ వాదులు ఖండించాలని కోరుతున్నామని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి కె. లోకనాథం తెలియజేస్తున్నారు.

# వార్డు సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శి

## వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు



నర్సీపట్నంః వార్డు సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శి కార్యక్రమం చేపడుతున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 15వ వార్డులో గ్రామదర్శి కార్యక్రమం నిర్వహించి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ వార్డులను అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, కౌన్సిలర్ సత్యనారాయణ, బంగార్రాజు, టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గీతం ప్రాంగణంలోనే అంత్యక్రియలు



స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి భౌతిక కాయాన్ని ఆదివారం అనగా ఈనెల 7వ తేదిన ప్రత్యేక Air India విమానంలో విశాఖ తీసుకు రానున్నారు. ఆదివారం ఉదయం 7:30 గంటల సమయానికి విశాఖ విమానాశ్రయం నుంచి సిరిపురం వద్ద గల ఆయన స్వగృహానికి తీసుకు వస్తారు.

ఆనంతరం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో అభిమానుల తుది వీడ్కోలు నిమిత్తం ఉంచ నున్నారు.

తదనంతరం భారీగా అంతిమ యాత్రను రుషికొండ వద్ద గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వరకు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం చేశారు.



## నా జీవితానికి గురుస్థానం పెద్దాయనదే

*మాధవధారః విద్యార్థి దశ నుంచి నేను చూస్తున్న మహోన్నత వ్యక్తిత్వం కలిగిన విద్యాప్రదాత, రాజకీయ దురంధరుడు అయినటువంటి స్వర్గీయ ఎంవివిఎస్ మూర్తి నా జీవితానికి మార్గదర్శకుడై గురువుగా మొదటి స్థానం ఆయనదేనని టీడీపీ నగర అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు విచారం వ్యక్తం చేశారు. తాను టీడీపీ పార్టీలో నగర, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు మూర్తిగారి కృషి మరువలేనిదన్నారు. అమెరికా పర్యటనలో అకాల మృత్యువాత పడిన స్వర్గీయ మూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని పాండురంగారావు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.*

# ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

రోలుగుంటః రోలుగుంట జెడ్పీ పాఠశాల నుంచి 2017-2018 సంవత్సరానికి గాను పరిధిలో అధిక మార్కులు తెచ్చుకున్న నలుగురు విద్యార్థులు ప్రతిభా అవార్డుకి ఎంపిక అయ్యారని హెచ్ఎం అప్పారావు తెలతిపారు. పాఠశాలకు చెందిన మలసాల భావన, తమరాన భువనేశ్వరి, మైనర్ల హేమలత, తాడి మణికంఠ అధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. అధిక మార్కులు తెచ్చుకున్న వీరి ప్రతిభ ఆధారంగా ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20వేలు, ప్రతిభా దృవపత్రం, ట్యాబ్‌ను అందజేస్తుందని హెచ్ఎం తెలిపారు.

# ప్రతిభా పురస్కారాలు అందజేత

## నగదు, ధ్రువపత్రాలు, ట్యాబ్‌లు పంపిణీ

రావికమతంః ముఖ్యమంత్రి ప్రతిభా పురస్కారాలకు మండలంలో నలుగురు విద్యార్థులు ఎంపికయినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థులు ఇప్పటికే ఇద్దరు ఎంపిక కాగా రావికమతం సిద్దార్ధ స్కూల్ విద్యార్థులు మాచేపల్లి సంతోష్‌కుమార్, మామిడి సాయికిరణ్‌లు ఎంపికయ్యారు.

ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వీరిద్దరికి 10కి 10 పాయింట్లు రావడంతో వీరు ఎంపికైనట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ ఆర్. పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరరావు తెలిపారు.

# సంక్షేమ పథకాల అందజేతకు గ్రామదర్శిని చక్కటి వేదిక



నాతవరంః గ్రామదర్శిని ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చునని మండల ప్రత్యేకాధికారి డిపిఒ కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం పికెగూడెం గ్రామంలో గ్రామదర్శి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు గ్రామదర్శి చక్కని వేదిక అన్నారు. గ్రామస్థులకు సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. వాటిని ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకారావు, ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు, ఎంఇఒ అమృతకుమార్, ఏపిఎం, మండల అధికారులు, ఎంపిటిసి బి.వసంత, మాజీ సర్పంచ్ పి.రాజుబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 279 జివో రద్దు చేసే వరకు సమ్మె కొనసాగిస్తాం

## 2వ రోజు పారిశుధ్య కార్మికుల సమ్మె జయప్రదం

## సిఐటియు నగర అధ్యక్షుడు కుమార్




విశాఖపట్నంః మున్సిపల్ కార్మికులకు, ప్రజలకు నష్టం చేకూర్చే 279 జివోను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతుందని సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ స్పష్టత ఇచ్చారు. అలాగే 2వ రోజు పోలీస్‌లను రంగంలో దింపి ప్రైవేట్ కార్మికులతో పనిచేయించడానికి జివిఎంసి అధికారులు తీసుకున్న చర్యలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టడంతో 2వ రోజు సమ్మె జయప్రదం అయ్యిందన్నారు. శుక్రవారం మద్దిలపాలెం సిఐటియు కార్యాలయం నుండి మద్దిలపాలెం జంక్షన్ వరకు భారీ ప్రదర్శన అనంతరం ఆర్టీసి డిపో వద్ద రాస్తారోకో నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే 279 జివో కార్మికుల ఉపాధికి నష్టదాయకమని, ప్రజలపై కూడా భారాలు పడే ఈ జివోను రద్దుచేయాలని, కార్మికులకు కనీసవేతనం 18,000 రూపాయలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని తదితర డిమాండ్లతో కార్మికులు రాష్ట్రవ్యాపితంగా సమ్మె చేస్తున్నారన్నారు. ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి జివిఎంసి గుర్తింపు యూనియన్ ఆనంద్, జివిఎంసి యాజమాన్యం కుట్రలు పన్నుతుందని, ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

సిఐటియు జోన్ సహాయ కార్యదర్శి జెఆర్ నాయుడు మాట్లాడుతూ బయట కార్మికులను తీసుకొచ్చి పనిచేయిస్తే తగిన మూల్యం జివిఎంసి చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు మాత్రం అడగకుండానే జీతాలు పెంచి, పారిశుధ్యకార్మికులపై ఎందుకీ వివక్షత చూపుతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎ.సింహాచలం, వార్డు బాద్యులు చెల్లయ్యమ్మ, విజయ, రాజు, రమణ, శ్రీను, బేబి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 2022 నాటికీ అందరికీ ఇళ్లు

## క్రెడాయ్ జాతీయ అద్యక్షుడు జాక్స్ షా..




కంచరపాలెం : 2022 నాటికీ అందరికి ఇల్లు కంపించే లక్షంతో పని చేస్తున్నామని క్రెడాయ్ జాతీయ అద్యక్షుడు జాక్స్ షా పేర్కొన్నారు. ఈమేరకు భవన నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రత్యేక ప్రాజెక్టుల తీరు, తదితర విషయలు చర్చించేందుకు జీవీఎంసీ 39 వ వార్డు పరిది ఆర్.అండ్ .బి కూడలి వద్ద నున్న ఫెయిర్ ఫీల్డ్ మేరి యట్ హోటల్లో శుక్రవారం ఉదయం సమావేశం నివహించారు. భవన నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రత్యేక ప్రాజెక్టుల తీరు, ఆయా రాష్ట్రాల్లోని చాప్టర్ల నిర్వహణ, అందుబాటులో గృహవసతి వంటి అంశాలపై ఈసీజీసీ (ఎగ్జిక్యూటివ్ కమిటీ, గవర్నింగ్ కౌన్సిల్)లో చర్చించి, సూచనలతో ఒక నివేదికను అధికారులకు అందించనున్నట్లు క్రెడాయ్ ఏపీ ఛైర్మన్ కె. సుబ్బరాజు, అధ్యక్షుడు ఎ.శివారెడ్డి చెప్పారు. అనంతరం క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2022 సంవత్సరం నాటికి అందరికీ ఇళ్లు అనే లక్ష్యంతో చేరుకోవడంలో సహాపడినందుకు 14500 అందుబాటులోని గృహాలను నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేసారు .ఈ ప్రతిజ్ఞ ద్వారా భారత ప్రభుత్వ లక్ష్యమైన 2022 నాటికి అందరికీ ఇళ్ల అనే మిషన్ను చేరువ కావడానికి తమ వంతు సహాయం చేస్తామని పేర్కొన్నారు ఈ ప్రతిజ్ఞను విశాఖపట్నంలో జరిగిన ఉత్తమ ఎగ్జికూటివ్ కమిటీ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్లో చేర్చామన్నారు ఈ సమావేశంలో ప్రభుత్వ అధికారులు రాష్ట్ర మరియు పారిశ్రామిక పాల్గొంటున్నారన్నారు ఏసీ జెసి సమావేశం వద్ద క్రీడ ఓ ఇంటరాక్టివ్ వర్క్షాపును అందుబాటులో గృహాలపై నిర్వహించింది ఈ సమావేశాన్ని శ్రీశాంతి కటారియా ఛైర్మన్ రేరా లీగల్ , మరియు అబ్దుల్ హౌసింగ్ కమిటీ క్రెడై య్ సభ్యులు పాల్గొన్నారు

శనివారాల్లో కూడా హోటల్ మారియట్‌లో ఈ సమావేశాలు నిర్వహిస్తామని, 23 రాష్ట్రాల్లోని 220 చాప్టర్ల నుంచి క్రెడాయ్ సభ్యులు, ఆయా రాష్ట్రాల బిల్డర్లు హాజరవుతారని చెప్పారు. మొదటిసారిగా విశాఖలో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయరంగం తరువాత ఎక్కువమంది ఉపాధి పొందుతున్నది నిర్మాణ రంగంలోనేనని, జీడీపీ వృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకాలు, ఉచిత ఇసుక విధానం, ఆన్‌లైన్ అనుమతులు వంటి వాటిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సామాజిక బాధ్యత కార్యక్రమం కింద క్రెడాయ్ ఎన్నో పనులు చేపడుతోందన్నారు. క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఛైర్మన్ జి.వి.వి.ఎస్. నారాయణ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రెడాయ్ సభ్యులకు నగరంలోని ప్రకృతి అందాలను చూపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. క్రెడాయ్ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు పీలా కోటేశ్వరరావు, కార్యదర్శి కేఎస్ఆర్కే రాజు, క్రెడాయ్ ఏపీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గున్నారు .

## *7న వ్యవసాయ కార్మికుల సమస్యలపై సమావేశం*

కొయ్యూరు : మండలంలో బాలారంలో ఈ నెల 7న వ్యవసాయ కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు, మండల సహాయ కార్యదర్శి గోకిరి చిన్నారావు, చింతలపూడి మాజీ సర్పంచ్ గుమ్మా రాంబాబు, సిపిఐ నేత నరేష్ తెలిపారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడారు. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశం చర్చిస్తామన్నారు.

## రెండో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీలో కాంట్రాక్టు పారిశుద్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంకు రెండో రోజుకు చేరింది. సమ్మెకు ఏఐటియుసి నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఏసుదాసు మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.1000 ఇప్పటికీ పెంచలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే పర్మినెంట్ చేసి వారికి ఈ ఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

# 10న నైపుణ్యా శిక్షణ కోర్సు నోటిఫికేషన్ విడుదల

## - యువతకు ఉపాధి కల్పించే కోర్సుల నిర్వహణకు శ్రీకారం - వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్రవిశ్వవిద్యాలయం : యువతకు ఉపాధి కల్పించే దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభిస్తోంది. ఈ నెల 10వ తేదీన దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. అక్టోబరు 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 25వ తేదీన ప్రవేశాలు కల్పిస్తారు. నవంబర్ 5వ తేదీనుంచి తరగతులు ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు మూడు నెలల కాలం ఏయూలోఈ శిక్షణ ఉంటుందన్నారు. విశాఖలోని వివిధ సంస్థల్లో 10 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేసే విధంగా ఈ కోర్సు రూపకల్పన చేశారు. కోర్సు ఫీజుగా రూ 8 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా రైటింగ్, డ్రాఫ్టింగ్ స్కిల్స్, ఎం.ఎస్ ఆఫీస్, టైపింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తిచేసే సమయానికి ఉపాధిని కల్పించే దిశగా ఏర్పాట్లు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటిఏపి), ఏయూ, పరిశ్రమలు సంయుక్తంగా గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ శిక్షణ తగరతులను నిర్వహిస్తామన్నారు. డిగ్రీ విద్యార్థులతో పాటు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మశీ, నర్సింగ్ కోర్సులు చదివిన వారు సైతం దరఖాస్తు చేయవచ్చునన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.



**సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ ప్రతిపాదనలు సిద్ధం.....**

సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను ఏయూలో ఏర్పాటు చేయడానికి సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. ఏయూకు విచ్చేసిన రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి పి.హరి ప్రసాద్‌తో దీనిపై చర్చించారు. రూ 60 కోట్లతో ఏయూలో సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను వీసీ నాగేశ్వర రావు రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి హరి ప్రసాద్‌కు అందజేశారు. వర్సిటీకి ఈ విద్యా సంవత్సరంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్ మెంట్ నుంచి తక్షణం 5 కోర్సుల నిర్వహణకు అనుమతి మంజూరు చేసింది. డిసెంబర్ మాసంలో మరో 10 కోర్సులు నిర్వహణకు అనుమతి పంపుతుందని వీసీ నాగేశ్వర రావు ఈ సందర్భంగా తెలిపారు.

విజయభాను

## సంపాదకీయం

### లైంగికదాడి కేసులు తేలాలి

సాధారణంగా మహిళలు తమపై లైంగికదాడి జరిగిందని ధైర్యంగా ఆరోపణలు చేయడానికి జంకుతారు. లైంగికదాడికి గురైన వారిని బాధితురాలిగా చూసి సాంత్వన కలిగించడానికి బదులు, అవమానకరంగా చూస్తారనే భయం వల్ల చాలా లైంగిక నేరాలు వెలుగులోకి రావు. లైంగికదాడి గురైన మహిళ శీలంపై అనుమానం కలిగే ఆరోపణలు చేయడం ద్వారా అవతలిపక్షం తమ వాదనను నెగ్గించుకోవడానికి ప్రయత్నిస్తుంది. కేరళ నన్ విషయంలోనూ ఇటువంటి ధోరణే కనిపిస్తున్నది. కేరళలోని ఒక నన్ తనపై బిషప్ (క్రైస్తవ మతాధికారి) లైంగికదాడికి పాల్పడ్డారంటూ చేసిన ఆరోపణపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి విమర్శలకు తావిస్తున్నది. లైంగిక దాడికి పాల్పడిన జలంధర్ బిషప్ ఫ్రాంకో ములక్కల్‌పై చర్య తీసుకోవాలంటూ 43 ఏండ్ల వయసుగల ఈ బాధితురాలికి మద్దతుగా మరికొందరు నన్‌లు కూడా హైకోర్టు బయట నిరసన ప్రదర్శన సాగిస్తున్నారు. 2014లో బిషప్ తనను అధికారిక విషయాలు చర్చించడానికంటూ పిలిపించి లైంగికదాడికి పాల్పడ్డారనీ, ఆ తర్వాత రెండేండ్లపాటు తనపై పదమూడు సార్లు లైంగిక దాడి జరిగిందని బాధితురాలు ఆరోపించారు. కానీ ఈ ఆరోపణలను బిషప్ తిరస్కరించారు. ఆమెకు ఒక వివాహితుడితో లైంగిక సంబంధం ఉందనీ, అతడి భార్య ఫిర్యాదు మేరకు ఈమెను విచారించానని ఆయన అంటున్నారు. తాను ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టినందుకే కక్షతో తనపై ఈ లైంగికదాడి ఆరోపణలు చేస్తున్నదని ఆయన అంటున్నారు. బిషప్, నన్ ఇరువురూ గౌరవప్రదమైన వ్యక్తులు. వారిపట్ల సమాజంలో ఆరాధనాభావం ఉంటుంది. ఈ వివాదంలో దోషులెవరనేది దర్యాప్తు పూర్తయి, న్యాయస్థానం తీర్పు ఇస్తే కానీ తెలువదు. కానీ తనపై లైంగికదాడి జరిగిందని ఒక స్త్రీ ఆరోపించినప్పుడల్లా ఆమె పట్ల సమాజం, చట్టబద్ధ సంస్థలు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉంటున్నది. కేరళ నన్ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం, ఇతర పెద్దలు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెలువడుతున్నాయి. లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బిషప్‌ను ఆ పదవి నుంచి తప్పించి, దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని బాధితురాలు, ఆమెకు మద్దతు ఇస్తున్న నన్‌లు కోరుతున్నారు. కానీ ఇప్పటివరకు మత సంస్థ ఆయనపై చర్య తీసుకోలేదు. పైగా బిషప్‌కు వ్యతిరేకంగా బయ టిశక్తులు కుట్ర పన్నుతున్నాయనే ఆరోపణ మత సంస్థ వర్గాల నుంచి వెలువడింది. సీనియర్ మతాధికారులకు ఈ ఉదంతంలో తమదైన అభిప్రాయం ఉండవచ్చు. దానిని విమర్శించే వారూ ఉండవచ్చు. ఆయనపై చర్య తీసుకోవడమనేది మత సంస్థకు సంబంధించిన అంశం. కానీ నేరం జరిగింది మన దేశంలో. ఇక్కడ చట్టబద్ధపాలన సాగుతున్నది. ప్రభుత్వం, న్యాయవిచారణ వ్యవస్థ ఉన్నాయి. ఈ వ్యవస్థలు నిష్పక్షపాతంగా పనిచేయాలె. కానీ నన్ తనపై లైంగికదాడి జరిగిందని పోలీసులకు జూన్ 27వ తేదీన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన రెండున్నర నెలలు గడిచినా ఇప్పటి వరకు పోలీసులు బిషప్‌ను అరెస్టు చేయలేదు. బిషప్‌ను ఒక్కసారి మాట వరుసకు విచారించి, బాధితురాలిని మాత్రం పదిసార్లు ప్రశ్నించడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమనే ఆరోపణలు వినబడుతున్నాయి. బాధితురాలిని అదేపనిగా ఇంటరాగేట్ చేయడం ద్వారా ఆమె వివరణల్లో తేడాలుంటే, దొరుకబట్టి కేసును బలహీనపరిచే ఉద్దేశం ఉందని అంటున్నారు. ఈ కేసు విషయంలో తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని హైకోర్టు ఆదేశించవలసి వచ్చింది. తదుపరి విచారణ ఈ నెల పదమూడవ తేదీన ఉన్న నేపథ్యంలో, ఒకరోజు ముందే పోలీసుల్లో కదలిక కనబడ్డది. బుధవారం నాడు ఆరు గంటల పాటు ఉన్నత స్థాయిలో తర్జనభర్జనలు జరిపి బిషప్‌ను ఈ నెల పందొమ్మిదవ తేదీన దర్యాప్తు బృందం ముందు హాజరుకావాలని ఆదేశించారు. సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాజకీయంగా దెబ్బతింటామనే భయంతో మతాధికారిపై చర్య తీసుకోవడానికి సిద్ధంగా లేదనే విమర్శలున్నాయి. కానీ ఈ ఉదంతాన్ని కూడా లైంగికదాడి ఆరోపణగా చూడాలే తప్ప, మతకోణంలో కాదు. బాబాలు, స్వామీజీలు, బిషప్‌లు- ఆరోపణలు ఎవరిపై వచ్చినా చట్టప్రకారం చర్య తీసుకోవలసిందే. బిషప్ ప్రాబల్యం, ధనబలం వల్ల రాజకీయ వర్గాలు, పోలీసు యంత్రాంగం ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించలేక పోతున్నాయని నన్‌లు ఆరోపిస్తు న్నారు. ఒక మతాధికారిపై సాధారణ నన్ ధైర్యం గా ఆరోపణలు చేయడం అంత సులభం కాదు. మతాధికారులపై లైంగికదాడి ఆరోపణలు రావడం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నది. కేరళలో కూడా ఇటువంటి ఆరోపణలు కొత్త కాదు. 1992 నాటి సిస్టర్ అభ య హత్యోదంతం ఇప్పటికీ ఎటూ తేలలేదు. తాజా కేసులో నన్ ఆరోపణలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే, మహిళలు తమపై దాడులను ధైర్యంగా వెల్లడించగలుగుతారు.

## ఆర్‌బీఐ దెబ్బకు కుదేలైన స్టాక్‌మార్కెట్లు

ముంబయి: మూలిగే నక్కపై తాటిపండు పడటమంటే ఇదేనేమో! బుల్‌కు పడిన పుండును కాకి పొడవటం అంటే కూడా ఇదేనేమో! గురువారం ఓవైపు చమురు.. మరోవైపు రూపాయి మార్కెట్ల పతనాన్ని శాసించిన వేళ.. అగ్నికి వాయువు తోడైనట్లు శుక్రవారం ఆర్‌బీఐ తోడైంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా వడ్డీరేట్లను మార్పు చేయకపోవడం మార్కెట్లకు రుచించలేదు. దీంతో సెన్సెక్స్ ఒకనొక దశలో ఏకంగా 900 పాయింట్లకు పడిపోగా, నిఫ్టీ 10,300 దిగువకు చేరింది. చివర్లో నన్ను మర్చిపోయారా? అంటూ రూపాయి పతనమై సూచీల పతనానికి అదీ ఒక కారణమైంది. ఉదయం మార్కెట్లు నష్టాలతోనే ట్రేడింగ్‌ను మొదలు పెట్టాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షతో పాటు, బలహీన అంతర్జాతీయ పరిణామాలతో సూచీలు నష్టాలను చవిచూశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 335 పాయింట్లు కోల్పోయి 34,833 ట్రేడింగ్‌ను కొనసాగించింది. ఇక నిఫ్టీ కూడా 90 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఆరంభ భయాలు కొనసాగిన వేళ, ఆర్‌బీఐ ప్రకటనతో సూచీలు మరింత పతనమయ్యాయి. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రేపో, రివర్స్ ప్రో రేటులను వరుసగా 6.5శాతం, 6.25శాతంగా యథాపూర్వక స్థితిని కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో మార్కెట్లు భారీ నష్టాల్లోకి కూరుకుపోయాయి. ఓ దశలో సెన్సెక్స్ 900 పాయింట్ల నష్టపోగా, నిఫ్టీ 10,300 పాయింట్లకు దిగువన ట్రేడింగ్‌ను కొనసాగించింది.

చివరకు సెన్సెక్స్ 792.17 పాయింట్లు నష్టపోయి 34,376 వద్ద ముగిసింది. నిఫ్టీ ఏకంగా 282 పాయింట్ల నష్టంతో 10,316 వద్ద ట్రేడింగ్‌ను ముగించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత పతనమై రూ.74.1 వద్ద ట్రేడింగ్ కొనసాగుతోంది.

శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, టైటాన్ కంపెనీ, టీసీఎస్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు తదితర షేర్లు లాభపడగా, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్, బజాన్ ఫైనాన్స్ మొదలైన షేర్లు నష్టాలను చవి చూశాయి.

## సీఈసీకి నివేదిక సమర్పించిన రజత్‌కుమార్



దిల్లీ: తెలంగాణలో ఎన్నికల సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక ప్రక్రియ ముగియనున్న వేళ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్ కుమార్‌తో కేంద్ర ఎన్నికల కమిషన్ హస్తినలో సమావేశమైంది. ఈనెల 10న ఈసీ బృందం హైదరాబాద్ వచ్చే అవకాశముంది. అనంతరం ఎన్నికల నిర్వహణ తేదీ ప్రకటన ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులతో సమావేశమైన కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా తయారీ, ఈవీఎంలు సిద్ధం వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు ఉన్న పరిస్థితులను రజత్‌కుమార్ సీఈసీకి వివరించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానికి రజత్‌కుమార్ నివేదిక సమర్పించారు. మరో వైపు ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తుది విచారణ పూర్తయ్యే వరకూ ఓటర్ల జాబితా విడుదల చేయవద్దని ఆదేశించిన నేపథ్యంలో దీనిపై కూడా ఈసీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## ధోనీ.. కింగ్ ఆఫ్ క్రికెట్

### హాంకాంగ్ క్రికెటర్



దిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీని అభిమానులు ముద్దుగా మిస్టర్ కూల్ అని పిలుచుకుంటారు. నిజానికి ధోనీ కూడా ఆ పేరుకు సార్థకత చేకూరుస్తూ ఉంటాడు. హాంకాంగ్ క్రికెటర్ ఎహెసాన్ ఖాన్ కూడా ధోనీకి అభిమాని. ఇక ధోనీని, సచిన్‌ని ఔట్ చేయాలనేది ఖాన్ కల. ధోనీనైనా తనే స్వయంగా పెవిలియన్‌కు పంపాలనేది అతడి లక్ష్యం. ఇటీవల జరిగిన ఆసియాకప్‌లో భాగంగా హాంకాంగ్-భారత్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అతడి చిరకాల వాంఛ తీరింది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎహెసాన్ కారణంగానే ధోనీ డకౌట్ అయ్యాడు. దీంతో అతడి ఆనందానికి అవధుల్లేవు. ఈ విషయాన్ని స్వయంగా ఖాన్ మీడియాకు చెప్పాడు. క్రికెట్ తర్వాత తన భవిష్యత్తు ప్రణాళికలేంటని అడిగిన ప్రశ్నకు ఖాన్ ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

సచిన్ క్రికెట్ దేవుడయితే ధోనీ కింగ్ ఆఫ్ క్రికెట్. భవిష్యత్తులో నా జీవితం మీద నేను ఓ పుస్తకం రాయాలనుకుంటున్నా. అందులో ప్రధాన భాగం ఎం.ఎస్ ధోనీదే ఉంటుంది. ఈ పుస్తకాన్ని నా మనవళ్లతో చదివిస్తాను. ఎందుకంటే జీవితం ఓ అద్భుతమైన కథ. సచిన్, ధోనీలను ఔట్ చేయాలనేది నా చిరకాల కోరిక. సచిన్‌తో ఎలాగూ ఇప్పుడు సాధ్యపడదు. ఇందుకు నాకు మొదట్లో చాలా బాధేసింది. కానీ, ధోనీని ఔట్ చేయగలిగాను. దీంతో నా కోరిక తీరింది. నేను రాసే పుస్తకంలో ఆయన సంబంధించిన అంశాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాను. ఈ విధంగా నా అభిమానాన్ని చాటుకుంటాను అని తెలిపాడు.

## భారీగా తగ్గిన బంగారం ధర!

న్యూఢిల్లీ: గత రెండు రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధర శుక్రవారం భారీగా పతనమైంది. నేటి ట్రేడింగ్‌లో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.250 తగ్గి రూ.31,850కి చేరింది. స్థానిక వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గడంతోపాటు అంతర్జాతీయంగా నెలకొన్న బలహీన పరిస్థితుల కారణంగా ధర తగ్గినట్టు బులియన్ వర్గాలు తెలిపాయి. బంగారం బాటలోనే పయనించిన వెండి కిలోకు రూ.100 తగ్గి రూ.39,250కి చేరుకుంది. నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో పాటు పరిశ్రమ వర్గాల నుంచి అనుకున్న స్థాయిలో డిమాండ్ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కాగా, గత రెండు రోజుల్లో బంగారం ధర ఏకంగా రూ.625 పెరిగింది.

## కవి సమయం

### ఓం నమో సింహగిరీశాయ

ఓం నమో సింహగిరీశాయ!
నమో ప్రహ్లాద వరదాయ!
నమో చందన దయానిధీ!
శ్రీ వరాహలక్ష్మి, నృసింహా!
సింహాద్రి! మీ దివ్య శ్రీ మంగళ,
శ్రీ ధృవ రూపాన్ని సందర్శించుటమంటే...
మేము అక్షయ సిరులతో... నిత్యం
పరంపరగా... తుల తూగటం
అప్పన్నా! నాడు మీరు 'అర్జునునకు'
ఉపదేశించిన శ్రీ భగవద్గీత చరమశ్లోక,
శరణాగత దివ్య వైభవం మీరు నిత్యం
మీ తొలి పావంచా వద్ద భక్తికోటికి 'ఉపదేశం'
గోవిందా! మీరు శ్రీ చందనోత్సవం నుంచి
మళ్ళీ శ్రీ చందనోత్సవం వరకూ నిత్యమూ 'పరి'వర్తనం'తో
ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదన్న విషయాన్ని
మీకు తత్వోపదేశం నిత్యమూ నిరంతరం.

...కవితా రచన
మహ్మద్ అబ్దుల్ అజీజ్
సెల్ : 8179950628

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: ద్వాదశి మ.2.59; మఖ సా.4.35; ఉ.శే.వ.6.52వ రా.వ.12.06ల 1.36.

శుక్రవారం 06-10-2018

**మేషం** : ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. ప్రేమికుల మధ్య నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపి స్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి.

**వృషభం** : ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. నిరుద్యో గులకు కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్త్రీలకు వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. ఆడిటర్లకు, అకౌంట్స్ రంగాల వారికి పనిభారం అధికంగా ఉంటుంది.

**మిథునం** : చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఖర్చులు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్లు స్వీకరిస్తారు. బంధువుల రాకపోకలు సంతోషాన్ని కలిగిస్తాయి. రావలసిన మొండిబాకీలు సైతం వసూలు కాగలవు. లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి.

**కర్కాటకం** : ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి అనుకున్నది సాధిస్తారు. అనుకోకుండా ఏర్పడిన ఒక స్నేహబంధం భవిష్యత్‌లో మీకు మంచే చేస్తుంది. సంతానం విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. ఖర్చులు సామాన్యం.

**సింహం** : మొండి బాకాయిలి వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. కుటుంబ విషయాలు, ఆర్థిక లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

**కన్య** : నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగు తాయి. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైన సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. పత్రిక, ప్రైవేటు సంస్థలలో వారికి మార్పులు అనుకూలిస్తాయి.

**తుల** : దూర ప్రయాణాలలో మెళకువ అవసరం. తలపెట్టిన పనుల్లో ఒకింత జాప్యం, చికాకు తప్పదు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త అవసరం. ఆత్మీయుల నుంచి సహాయాన్ని పొందుతారు.

**వృశ్చికం** : విద్యార్థులు అతి కష్టం మీద పై చదువులకు అవకాశం లభిస్తుంది. మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. చేతి వృత్తుల వారికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. నూతన పరిచయాలు ఏర్పడతాయి.

**ధనుస్సు** : వాహనం నడుపునపుటలో మెళకువ అవసరం. రాజకీయ నాయకులకు పదవి సమస్యలు అధికమవుతాయి. మిత్రుల సహకారంచో ఓ సమస్యను సునాయాసంగా పరిష్కరిస్తారు. కంప్యూటర్ రంగాల వారికి పురోభివృద్ధి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మెళకువ వహించిండి.

**మకరం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాలు గూర్చి తగాదాలు రావచ్చు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన ధనం చేతికందకపోవడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరగలదు. నిరుద్యోగులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది.

**కుంభం** : కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు అదనపు సంపాదన దిశగా ఆలోచన చేస్తారు.

**మీనం** : కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కుకుంటారు. ప్రముఖులతో ముఖ్య వ్యవహారంపై సంప్రదింపులు జరుపుతారు. రుణ యత్నాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. గృహంలో దైవ కార్యక్రమాలుచేయుట వంటి శుభ పరిణామాలు ఎదుర్కుంటారు. స్త్రీలకు పనిభారం అధికం.

# దేవ దేవుడు.. శ్రీ వేంకటేశుడు

## సంకీర్తన



**వేంకటాద్రి సమం స్థానం**
**బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ**
**సమో దేవో న భూతో న భవిష్యతి**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూతకాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం కలి యుగ వైకుంఠమని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయం భూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడె%న శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి ఆనంద నిలయమనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

**స్థలపురాణం**

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహా ద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణ వనం అధిపతులు ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయనగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహ రాయలు, శ్రీకృష్ణదేవ రాయలు, తిరుమలరాయలు, అచ్యుత రాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంక ర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థల పురా ణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరు పతిలో పద్మావతి /బీబీనాంచారి/ అలివేలుమంగ అమ్మవారిని, గోవిందరాజస్వామి వారిని దర్శిం చుకోవాలి. తిరుమల గిరులలో ఉన్న పవిత్ర ఆకాశ గంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం.. వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాశస్త్య మున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహ నాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కు బడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి కల్యాణకట్ట వద్దనే తలనీలాలు సమర్పించాలి

**శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు**



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శన వేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈ-దర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

# భీమిలిలో గ్రామదర్శిని



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 20వవార్డు శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం దగ్గర జోనల్ కమీషనర్ పి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ దర్శిని కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు మాట్లాడుతూ 20 వార్డులో ఇప్పటి వరకు కోటి పన్నెండు లక్షల అరవై వేల రూపాయలతో కమ్యూనిటీ హాలు,సి.సి.రోడ్స్, కాలువలు, సామూహిక మరుగుదొడ్లు మొదలగు అభివృద్ధి పనులు జరిగాయని ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా కొత్తపథకాలు అమలు చేస్తున్నారని . చంద్రన్నభీమా, చంద్రన్న పెళ్ళి కానుక,వృద్ధాప్య ఫెన్షన్లు, మత్స్యకారులకు 50ఏళ్ళకే ఫెన్షన్లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేసారని . మంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గంలో ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కాసరపు నాగరాజు మాట్లాడుతూ బోయివీధిలో ఉన్న టాయిలెట్ లో నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారని , అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాలు పూర్తి చెయాలని , సముద్ర తీరంలో రిటైనింగ్ వాలు నిర్మాణం చేయాలని కోరారు.జోనల్ కమీషనర్ పి.దుర్గాప్రసాద్ దాని గురించి అధికారులు తో మాట్లాడుతానని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ ఖ్వాజా మెహబూబా జాన్, శానిటరీ ఇన్ స్పెక్టర్ రవి, సిఓ పాపారావు,టి.పి.ఆర్ ఓ శ్రీనివాస్ టీడీపీ నాయకులు , కొక్కిరి అప్పన్న,గిడుతూరి శ్రీనివాసరావు,బుత్తల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా అవార్డులకు ఎంపికైన శ్రీ సత్యసాయి విహార్ విద్యార్థులు






అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక సత్యసాయి విద్యా విహార్ నుండి 2018 వ సంవత్సరంలో 10 వ తరగతి పరీక్షలో పాఠశాల నుండి హజరైన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాదించి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డులను ప్రకటించింది.ప్రతిష్టాత్మకమైన ఈ ప్రతిభా అవార్డులు సత్య సాయి విహరుకు నాలుగు దక్కాయి. ప్రతిభా అవార్డులు అందుకొన్న విద్యార్థులు జి.సతీష్,కె.అనూష, డి.అజయ్,జి.నాని వీరిని పాఠశాల యాజమాన్యం, ఉపాద్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



అనకాపల్లి : పట్టణంలోని మళ్ల వీధిలో అనకాపల్లి జీవిఎంసీ జోనల్ కమీషనర్ రాము శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న అద్వాన పరిస్థితులను తిలకించారు. కాంగ్రెస్ నాయకులు కొరిబిల్లి పరి ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమీషనర్ ఇప్పటికే మురికి కాలువలను సిబ్బందిచేత మెరుగుపరిచారు. అలాగే రోడ్డుపై ఉన్న గోతులను మురికి కాలువలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే అక్కడ ఉన్న తెలుగుదేశంపార్టీ నాయకులు మాత్రం కమీషనర్ పర్యటనపై ఆగ్రహం వ్యక్తం చేయడం విశేషం. కమీషనర్ టీడీపీ ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ వారు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించడం పట్ల అసహనం వ్యక్తం చేయడం జరిగింది. ఏది ఏమైన ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఈసందర్భంగా కమీషనర్ అక్కడ ప్రజలకు హామీ ఇవ్వడం ఊరట కలిగించిన అంశం అనక తప్పదు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు.11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలను వేదపండితులు,అర్చకులు

నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర,ఏసి ఈరంకి.జగన్నాధరావు,పాలకమండలి సభ్యులు కొత్త.కొండబాబు, ఆలయ సిబ్బంది,రేపాక.రాంబాబు,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేసారు.

## ఈ నెల 10 వతేదీ నుండి 18వరకు కుంకుమ పూజలు

భీమునిపట్నం : దేవి నవరాత్రులు సందర్భంగా భీమిలి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేయుటకు ఆలయ ధర్మకర్తల మండలి నిర్ణయించారు. ఈ సందర్భంగా కరపత్రాలను భీమిలి జోనల్ కమీషనర్ పి.దుర్గా ప్రసాద్, తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు లు విడుదల చేసారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కాసరపు నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 10వ తారీకు నుండి 18వ తారీకు వరకు ఆలయంలో నవరాత్రులు పూజలు జరుగుతాయని. భక్తులు 9 రోజులు పూజలు చేయించుకొనేవారు ఆలయంలో 100 రూపాయలు చెల్లించి రసీదు పొందాలని అన్నారు , చివరి రోజున భక్తులకు అమ్మవారి కుంకుమ తో పాటు ప్రసాదం ఇవ్వబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి చౌదరి వెంకటేష్, ధర్మకర్తలు గాడు రవి, పుక్కళ్ళ లక్మి కుమారి, దాసరి వేణుగోపాల్, మట్టా కొండ మరియు మారోజు సంజీవకుమార్, కంచెర్ల కామేష్, గూడుపు రాజు, రాజగిరి రమణలు పాల్గొన్నారు.

# పోలీసు అమరులకు జోహార్లతో...
# సంస్మరణ వారోత్సవాలు : జిల్లా ఎస్పీ జి.పాలరాజు



విజయనగరం: జిల్లాలో ఈ నెల 5 నుండి 21 వరకు నిర్వహిస్తున్న పోలీసు అమరవీరు లసంస్మరణ దినోత్సవాలను నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ జి. పాలరాజు తే. 05-10-2018ది, శుక్రవారం నాడు తెలిపారు. ఈ సంస్మరణ దినోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో నిర్వహించిన "ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జి. పాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ జి. పాలరాజు మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో తీవ్రవాదుల దాడులలోను, శాంతిభద్రతల పరిరక్షణలోను ఉభయ రాష్ట్రాలలో ఇప్పటికే చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి ప్రాణ త్యాగాలకు గుర్తుగా ప్రతీ ఏడాదిఅక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంస్మరణ దినోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసుశాఖ పోలీసుల త్యాగాలను ప్రజలకు వివరిస్తూ జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడం, రక్తదాన శిబిరాలునిర్వహించడం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టడం, పాఠశాల విద్యార్థులకు వివిధ వక్తృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహించడం, విజయనగరం, బబ్బిలి, పార్వతీపురం సబ్ డివిజను పరిధిల్లో 5 కి॥మీ॥ల పరుగును ఈ నెల 21న వేరు వేరుగా నిర్వహించి, విజేతలగా నిలిచిన క్రీడాకారులకు రూ॥ 5000/-, రూ॥ 2500/- మరియు రూ॥ 1500/-లను వేరు వేరుగా ప్రోత్సాహకాలుగా అందిస్తామన్నారు. అదే విధంగా పార్వతీపురం పట్టణంలో వాలీబాల్ టోర్నమెంటును పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ టోర్నమెంటులో దాదాపు 150 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లుకు రూ॥ 25,000/-లు, రూ॥ 15,000/- మరియు రూ॥ 10,000/-లను అందజేస్తామన్నారు. పోలీసులు విధుల పట్ల, వారు చేస్తున్న త్యాగాలు, కష్టతరమైన కార్యక్రమాలను ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోలీసు పరేడ్ గ్రౌండులో 'ఓపెన్ హౌస్'ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ 'ఓపెన్ హౌస్'లో పోలీసుల త్యాగాలను ప్రజలకు వివరించడంతోపాటు, విధి నిర్వహణలో పోలీసుశాఖ ఉపయోగిస్తున్న వివిధ ఆయుధాల పనితీరు, నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానంను పోలీసుశాఖ ఏవిధంగా ఉపయోగిస్తున్నది, కమ్యూనికేషన్ వ్యవస్థ, నేరస్థలం నుండి వేలిముద్రల సేకరణ, బాంబులను ఏవిధంగా కనిపెట్టేది, వాటిని ఎలా నిర్వీర్యం చేసేది, బాంబులను కనిపెట్టుటలో డాగ్ స్క్వాడ్ పనితీరు, డ్రోన్‌ల పనితీరు, లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంటు సిస్టమ్ ద్వారా నేరస్థులను ఏవిధంగా పట్టుకోవచ్చునన్న విషయాపై వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి వచ్చే విద్యార్థిని, విద్యార్థులకు నిపుణులు అయిన పోలీసు అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున పాల్గని ఆయుధాల పనితీరును, డ్రోన్‌ల పనితీరును, నేర స్థలం నుండి వేలిముద్రల సేకరణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలును ఆసక్తికరంగా పరిశీలించి, వాటి గురించి విపులంగా నిపుణులును అడిగి తెలుసుకున్నారు.

అదే విధంగా గతంలో ప్రభుత్వం పోలీసు అమర వీరుల కుటుంబాలకు మంజూరుచేసిన ఇండ్ల స్థలాలు పట్టణాలకు దూరంగా ఉండడం, స్థలంలో రాయి ఎక్కువగా ఉండడం వలన ఇండ్ల నిర్మాణానికి పూర్తిగా అనుకూలంగా లేని కారణంగా వారికి పట్టణంలో వేరే ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు మంజూరు చేసేందుకుగాను రెవెన్యూ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నామని, రెవెన్యూ అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని, త్వరలో అమర పోలీసు కుటుంబాలకు పట్టణంలో ఇండ్ల స్థలాలను అందజేస్తామని జిల్లా ఎస్పీ జి. పాలరాజు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గనాలని, అమర వీరుల త్యాగాలను ప్రజలందరికి తెలిపే విధంగా పోలీసుశాఖ చేపట్టే కార్యక్రమాల్లో మమేకం కావాలని, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ జి. పాలరాజు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఎస్సీ మరియు ఎస్టీ సెల్-1 డిఎస్పీ త్రినాథ్, ఎఆర్ డిఎస్పీ ఎ. హనుమంతు, స్పెషల్‌బ్రాంచ్ సిఐలు వై.వి.శేషు, జి. రామకృష్ణ, ఆర్‌ఐలు శ్రీహరిరావు, గురునాధ రావు, రామకృష్ణ, శంకర్రావు, రమేష్, కమ్యూనికేషన్ సిఐ రమణమూర్తి మరియు ఇతర పోలీసుఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన పార్టీ నాయుకులు పాదయాత్ర



భీమునిపట్నం : జనసేన నాయకుల అలీవర్ రాయ్ పాద యాత్ర భీమిలి మండలం లోని చిట్టినగర్,ఎస్.సి కాలనీ, ఆసిపాలెం,నమ్మివానిపాలెం,బి.సి కాలనీ ప్రాంతాల్లో జరిగింది. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా జనసేన పార్టీ అధినేత పవన్ పై మంచి అభిప్రాయం ఉండాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సభ్యులు తమ్మిన ప్రియాంక, బాయిన నారాయణమ్మ , జగ్గుపిల్లి కుమారి,జగ్గుపిల్లి అప్పచ్చి,తమ్మిన అప్పలనర్సయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదర్శిని కార్యక్రమంలో పారిశుద్ధ్యముపై పరిశీలన



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో శుక్రవారం జరిగిన గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా స్దానిక దళిత పేట నందు ఉన్న ప్రధాన సమస్య డ్రైనేజీ పూర్తిగా నిర్మూలన అయిన సందర్భంగా గ్రామంలో ఉన్న చెత్త,చెదారం ఆ డ్రైనేజీ ద్వారా రావడం వలన ఆ చెత్త,కుళ్లిన మలినాలు కలిగిన నీరు కొంత కాలంగా ఆగిపోవడం వలన దళిత వాడలో డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరములు విజృంభిస్తున్నాయని కావున వాటిపై తగు జాగ్రత్తలు తీసుకోవలసినదిగా మండల రెవిన్యూ ఆఫీసర్ సుజాత గార్కి,పంచాయతీ సెక్రటరీ రామ్ శ్రీనివాస్, మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్యనారాయణ లకు వినతి పత్రాన్ని సమర్పించారు.రాష్ట్రంలో ప్రతీ ఏరియాలోనూ పబ్లిక్ మరుగుదొడ్లు తొలగించిననూ స్దానిక దళిత పేట నందు మాత్రము పబ్లిక్ మరుగుదొడ్లు తొలగించుటలేదు అని స్దానిక ఎమ్మోర్వో గారికి గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా విన్నవించగా దానికి ఆమె సానుకూలముగా స్పందించి దళిత పేటలో ఉన్న డ్రైనేజీని పరిశీలించి దీనిపై తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల.సతీష్,పలివెల.కొండలరావు, గంపల.సింహచలం, గంపల. సత్తిబాబు, దర్శిపూడి.సురేష్, గంపల. లోవరాజు, పలివెల.కామరాజు, పలివెల.మధు, గంపల.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్ల తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలి

ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు



పరవాడ : మండలకేంద్రమైనపరవాడహైస్కూల్(బాలురు)ను శుక్రవారము ఎంపిపి మాసవరపుఅప్పలనాయుడు సందర్శించారు. అనంతరము విద్యార్దులు తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లడుతూ విద్యార్దులు చదువు పట్ల తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్ ఇ ఒ సునీత,స్కూల్ కమిటిచైర్మన్ పైలహరేష్ , ప్రదానోపాద్యాయులు తథితర్లు పోల్గోన్నారు.

## బొంకులదిబ్బయూత్ అద్వర్యంలో దుర్గాదేవిపందిరిరాట మత్సవం



పరవాడ:మండలకేంద్రమైనపరవాడలో బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శుక్రవారముదుర్గాదేవి పందిరి రాట వేసారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపినాయకులు, గ్రామపెద్దలైన పైలపోతినాయుడు (పెద్దింటి),పైలఅప్పల నాయుడు చేతులుమీదగా ఘనంగారాటోత్సవము జరిగింది. అనంతరము పైలపోతినాయుడు మాట్లడుతూప్రతిఏడాదిలాగే ఈఏడాదికూడా నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈఉత్సవంలో భాగంగా ఈనెల 10వ తేదీనఉదయం 8గంటల సమయంలో శ్రీ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందిని,తదనంతరం ఈనెల 19వ తేదీనఅమ్మవారి అనుపుఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలోబండారు రామారావు,స్కూల్ కమిటిచైర్మన్ పైలహరేష్,పైలనరేష్, గెడ్డంఉమ,పైలవెంకటరావు,పైడింనాయుడు మరియుబొంకులదిబ్బయూత్ సభ్యులు మరియుఅధికసంఖ్యాలో మహిళలు తథితర్లు పోల్గోన్నారు.

# నేడు న్యాయవాదుల క్రీడా పోటీలు

### *12 జిల్లాల నుంచి పాల్గొంటున్న 250 మంది క్రీడాకారులు*



కాకినాడ : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొటికల పూడి సత్య శ్రీనివాస రావు వెల్లడించారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ దివంగత న్యాయవాదులు దురుశెట్టిశేష అప్పారావు, వంకాకృష్ణా బ్రహ్మం స్మారక టోర్నమెంట్ ఈ క్రికెట్ పోటీలను ఈనెల 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6నస్థానిక రంగరాయక్రీడా మైదానంలో ప్రారంభమవుతాయన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా ప్రోటోకాల్ జడ్జి జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్ ,జస్టిస్ ఎం. సీతారామమూర్తి ,జస్టిస్ ఎన్.బాలయోగి పాల్గొంటున్నట్లు తెలిపారు. ముగింపు సభకు జస్టిస్ చల్లా కోదండరాం, డి. వి .సోమయాజులు పాల్గొంటారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు మినహా మిగతా 12 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ క్రికెట్ టీం కెప్టెన్ అక్బర్అజాన్ బృందానికి బార్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం టీ షర్టులను బహూకరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భావనారాయణ, స్పోర్ట్స్ సెక్రెటరీ సునీల్ కాంత్ ,రాష్ట్ర టోర్నీ కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న నవరత్నాలు
# పేదల అభివృద్ధికి వెలుగు కిరణాలు

## జగనన్న సారథ్యంలో అందరికీ న్యాయం

**- జగన్ రాకతో రామరాజ్యం సాధ్యం - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు**

**- తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్**



విశాఖ సిటీః జగన్ రాకతో రామరాజ్యం స్థాపితమౌతుందని విశాఖ నగర తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. జగన్ రావాలి.. జగన్ కావాలి నినాదంతో పార్టీలో ఎందరో యువకులు, మహిళలు చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల 14వ వార్డు చైతన్య నగర్ పరిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులు, మహిళలు వైఎస్ఆర్ పార్టీలో చేరినట్లు ఆయన ప్రకటించారు.

ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఆయన ఆశయ సాధనకు నడుంకట్టిన యువత, అమలౌతున్న నవరత్నాలు పథకాలకు ఆకర్షితులైన మహిళలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

జగన్ ఆధ్వర్యంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు చేరువయ్యేలా ప్రయత్నిస్తున్న జగనన్నకు అందరూ ఓటు వేసి గెలిపించాలని వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన అందరికీ పార్టీ కండువా కప్పి అందరినీ పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మొల్లి అప్పారావు, గుడ్ల రమణ, గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో శరగడ రమణమ్మ, రేసపు కుమార రెడ్డి, ఎం, రమణ, గుడ్ల నరసింగరావు, అప్పల నర్సింగరావు, బూస రమణారెడ్డి, నర్సింగరావు, బోర రామిరెడ్డి, సూరిబాబు నాయుడు, చుక్కా రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రావాలి జగన్ - కావాలి జగన్



గడప గడపకు నవరత్నాలు కార్యక్రమం 14 వార్డు నక్కవానిపాలెం గ్రామం లో జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సన్వయకర్త

కె కె.రాజు 14వార్డు అధ్యక్షురాలు జి.వి.రమణి,ఉత్తర నియోజకవర్గం వార్డు అధ్యక్షులు మరియు జి.వి.రమణారెడ్డి (సిటీ సెక్రెటరీ) ,పద్మ రెడ్డి, వేంకటేశ్వర రెడ్డి,బాబ్జీ రెడ్డి, సీతాకుమారి, జమున, పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే రవాణా సేవలు..

**- అందరూ లైసెన్స్‌లు కలిగి ఉండాలి -ఎల్.ఎల్.ఆర్ మేళాతో వాహనచోదకులకు మేలు**

**- రవాణా శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరావు ...**



కంచరపాలెం : వాహనదారులు తప్పకుండ లైసెన్స్‌లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ప్రజల వద్దకే రవాణా సేవలు అనే నినాదంతో నియోజకవర్గం పరిధి వార్డుల వారీగా ఎల్ .ఎల్ .ఆర్ మేళా నిర్వహిస్తునామని రవాణా శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. ఈమేరకు జీవీఎంసీ 40వ వార్డు పరిధి నరేంద్ర నగర్ వద్ద నున్న అంబెడ్కర్ భవన్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ఎల్ .ఎల్ .ఆర్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లడుతూ ఎందరో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనదారునికి లైసెన్స్ లేక ప్రమాదాల బారిన పడ్డ వారు బీమా సౌకర్యం పొందలేకపోతున్నారు . దింతో వాహనదారులు తప్పక లైసెన్స్ కలిగివుండాలనే లక్ష్యంతో వారి కోసం రవాణా శాఖ మీ ముంగిట్లోకి రవాణా సేవలు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటివలే నిర్వహిస్తున్న ఎల్ .ఎల్ .ఆర్ మేళా కు ప్రజలనుండి విశేష స్పందన లభిస్తుందన్నారు . జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈ మేళాలో 45 వేల మందికి రాష్ట్రములో తొలి సారిగా ఎక్కువ ఎల్ఎల్ఆర్ పొందారని అదే విధముగా నెల రోజుల తరువాత సంబంధిత రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి లెర్నింగ్ పరీక్షలో పాసై లైసెన్స్ పొందవచ్చని అన్నారు . కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ కింజరపు ప్రభాకర్ రావు మాట్లడుతూ రహదారిపై లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారే తమ తనిఖీలలో అధికంగా పట్టుబడుతున్నారని అన్నారు . తల్లి దండ్రులు తమ పిల్లలకు వాహనాలు కొనే ముందు వారు లైసెన్స్ పొందే విదంగా ప్రోత్సహించాలని కోరారు . వాహనదారుడికి, ఎదురుగా వచ్చే వారికి కూడా ధీమా కలిగించేది డ్రైవింగ్ లైసెన్స్. డ్రైవింగ్ లైసెన్స్ లేనిపక్షంలో జరిగే అనర్థాలు కోకొల్లలు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో డ్రైవింగ్ లైసెన్స్ కీలకం కానుందని . లైసెన్స్ లేని ప్రయాణాలు జరిమానాలు నుంచి జైలు శిక్షల వరకు తీసుకువెళ్తున్నాయి. ప్రమాద బాధ్యుడికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో బాధితులకు బీమా సౌకర్యం కూడా అందని పరిస్థితులు కనిపిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు . అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు .కార్యక్రమంలో భాగంగా ఎల్ .ఎల్ .ఆర్ మేళాకు వచ్చిన అభ్యర్థుల ధ్రువ పాత్రలని పరిశీలించారు . అనంతరం కంప్యుటర్ టెస్ట్ నిర్వహించి అర్హులకు ఎల్ .ఎల్ .ఆర్ అందజేశారు . కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ .టి.వో ఎ .హెచ్ .ఖాన్ , ఎం ఏ జేవీ ఎస్ ఎస్ ప్రసాద్ , ఏ ఎం ఏ ఎస్ వి ఆర్ మూర్తి , పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు పాల్గొన్నారు .

## దొంగలే ఐటీ దాడులకు భయపడతారు?: కన్నా

గుంటూరు: ఐటీ దాడులకు దొంగలు భయపడాలి కానీ.. టీడీపీ నేతలు ఎందుకు భయపడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. మంగళగిరిలో బీజేపీ ఓబీసీ మోర్చా కమిటి ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి బీజేపీ నేతలు కన్నా, జీవీఎల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. పన్నులు ఎగ్గొట్టే వారిపైనే ఐటీ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్యోగులు వారి బాధ్యత నెరవేరుస్తున్నారని చెప్పారు. ఎన్నికల సభల్లో కేసీఆర్ వాడుతున్న భాష సరైంది కాదని హితవుపలికారు. ఎదుట వ్యక్తిని గౌరవించడం ప్రతీ ఒక్కరి సంస్కారమని స్పష్టం చేశారు. ఇది చంద్రబాబు కూడా నేర్చుకోవాలని సూచించారు. మోదీని టీడీపీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడినప్పుడు బాబు ఎందుకు స్పందించలేదని అడిగారు.

**- జగనన్న బాటలోనడుద్దాం... రాజనన్న రాజ్యం సాధిద్దాం**

**- 'దక్షిణ'ంలో వినూత్న రీతిలో ప్రచారం చేస్తు, ప్రజలకు చేరువవుతున్న వైయస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి**



విశాఖసిటీ : గడపగడపకు నవరత్నాలు దక్షిణ నియోజకవర్గంలో 15 వ వార్డ్ ప్రెసిడెంట్ సర్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు జగనన్న నవరత్నాలు అవగాహన కార్యక్రమాంచేపట్టారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ సమన్వయ కర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి హాజరై కార్యక్రమన్ని ప్రారంభించారు. కళా హాస్పిటల్ రోడ్, భగత్ సింగ్ కొలనీ, శంకర మఠం రోడ్, నెహ్రూ బజార్, సిరప వారి వీధి దొండపర్తి బూత్ నెం 226, 231 , 232 పరిధిలో గడప గడపకు వెల్లి స్థానిక సమస్యలు తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ

ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికీ అన్ని విధాలా ప్రయోజనాలు చేకూరే విధంగా రూపొందించడం జరిగిందన్నారు. జగనన్న అధికారంలోకి వస్తే పేద, బడుగు, బలహీవ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద రైతులకు సంవత్సరానికి రూ. 12,500లు చొప్పున పెట్టుబడికి సహాయంగా అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే, రైతన్నలకు ఉచిత విద్యుత్తుతో పాటు బోర్ల ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు, వైద్య ఖర్చులు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపజేయడం, ప్రస్తుతం ఉన్న వృద్ధాప్య పింఛనును 60 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలకు తగ్గించి రూ. 2,000లు చొప్పున, అలాగే అంగవైకల్య పింఛను కింద రూ. 3,000లు అందజేస్తామన్నారు. అదే విధంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, అమ్మ ఒడి తదితర పథకాలు పక్కాగా అమలు చేసేందుకు అధినేత జగన్మోహన్ రెడ్డి పూర్తి విశ్వసనీయత కలిగి ఉన్నారని డాక్టర్ రమణమూర్తి తెలియజేశారు. గత ఎన్నికల సమయంలో అధికారం కోసం మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టిన ప్రభుత్వ పెద్దలు నేడు ఎన్నికల హామీలను గాలికి వదిలేసి అధికార దాహంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని ఆయన తెలియజేశారు. రాజన్న రాజ్య స్థాపన కోసం జగనన్న చేస్తున్న ఈ మహాయజ్ఞానికి మనందరం ఆయన వెంట ఉండి జగనన్నకు మరింత భరోసా నందిస్తూ ప్రజాసేవకే అంకితమౌదామని డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి లండా రమణ, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, గుత్తుల నాగభూషణం, ఎస్సీ సెల్ విభాగం బోణి శివరామకృష్ణ, బోణి దేవా, వార్డ్ బీసీ సెల్ అధ్యక్షుడు బి. అప్పారావు, కె.మదురెడ్డి, పి. పెద్దరాజు, ఈ. శ్యామ్ ప్రసాద్ , లంకా శ్రీనివాస్, కె. సూరిబాబు, ఎం. తాత బాబు, ఎన్. చిరంజీవి రెడ్డి, ఎం. గణేష్ రెడ్డి , కె. రవి , ఈ. సీతారాం , సూరిబాబు, మరియు రాష్ట్ర , జిల్లా, నగర ముఖ్య నాయకులు పాల్గున్నారు.



## హెచ్ఆర్ పద్ధతులపై ఉపన్యాసం



విశాఖపట్నం : చాప్టర్ ఎన్ఐపిఎం వారు హెచ్‌పిసిఎల్‌తో సంయుక్తంగా హెచ్ఆర్ ఎట్‌ది రేట్ ఆఫ్ హెచ్‌పిసిఎల్ ట్రాన్సాక్షన్ టు ట్రాన్స్‌ఫర్మేషన్ అనే అంశంపై ఉపన్యాసమును నిర్వహించారు. శ్రీ శెట్టి హెచ్‌పిసిఎల్ అవలంబిస్తున్న పలు హెచ్ఆర్ పద్ధతులు, ఆర్థిక ఉత్పాదకతకై వారు అనుసరిస్తున్న విధానాలపై పలు విషయాలు తెలిపారు . అలాగే సిబ్బందికి పనితనం పెంపుదలకై వారికి ఇస్తున్న ప్రత్యేక శిక్షణలపై వివరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎన్ఐపిఎం చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్‌విఎస్ సుధాకర్, సెక్రటరీ డాక్టర్ వరప్రసాద్, మరియు ఇతర ఎన్ఐపిఎం సభ్యులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరంతో నేవీడే-2018 ప్రారంభం



విశాఖ సిటీ : డిసెంబర్ 4న నిర్వహించబడే నేవీడే కొరకు తొలి అడుగు మెగా రక్తదాన శిబిరంతో ప్రారంభమయ్యింది.

నేవీడే-2018 కార్యక్రమాల్లో భాగంగా తూర్పు నౌకాదళం పలు కార్యక్రమాలను చేపట్టనుంది. రెండు నెలలపాటు జరగనున్న నేవీడే సంబంధిత కార్యక్రమాలు ప్రాంతీయ ప్రజలకు నేవీతో సంభాషణ అవకాశం లభించనుంది. డిసెంబర్ నెలలో జరగనున్న నేవీడేను పురస్కరించుకుని సంబంధిత కార్యక్రమాలు, మెగా రక్తదాన శిబిరాలతో నావికులు శ్రీకారం చుట్టారు. ఐఎన్ఎస్ రంజిత్ కమాండింగ్ అధికారి కెప్టెన్ విక్రమ్ మెహ్రా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నావికా సంబంధిత మరియు డిఫెన్స్ సంబంధిత 268 మందికి ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. తదుపరి సేకరించిన రక్తాన్ని ఎన్‌టిఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. డెంగ్యూ మరియు రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితుల అవసరార్థం సేకరించిన రక్తాన్ని ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చురుకుగా పాల్గొన్నారు.

# వరుణ్ బజాజ్‌లో 26వ వార్షికోత్సవ సంబరాలు



విశాఖ సిటీ : భారత దేశపు నం. 1 బజాజ్ డీలర్ వరుణ్ బజాజ్ తమ 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్ మాట్లాడుతూ వరుణ్ బజాజ్ 26వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. వరుణ్ బజాజ్ గ్రూప్ విశాఖపట్నంలో 26 సంవత్సరాల క్రిందట ప్రారంభించబడి అతిత్వరలోనే భారతదేశంలో అతి పెద్ద బజాజ్ డీలర్‌గా రూపాంతరం చెందిందని అన్నారు. నేడు విశాఖపట్నంతోపాటు హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, భీమవరం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాలలో వారి సేవలను అందిస్తున్నారని అన్నారు. లక్షలాదిమంది వినియోగదారులకు మరింత సేవలందిస్తూ అందరి అభిమానాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వరుణ్ బజాజ్ సిఇఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా వినియోగదారులను ఆకట్టుకునేందుకు కొన్ని ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తోందని తెలియజేశారు. ఈ ఆఫర్లలో భాగంగా బజాజ్ పల్సర్ 180 సిసి, ఆపై మోడల్స్ కొనుగోలుపై నగదు మొత్తాన్ని బహుమతిగా పొందే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కొన్ని మోడల్స్‌పై 4 సంవత్సరముల అదనపు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మరికొన్నిటిపై హెల్మెట్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా 9 ఎల్ఇడి టివిలను కూడా అందిస్తున్నామన్నారు. ఇవే కాకుండా 5 ఉచిత సర్వీసులు, డ్యామేజ్ బీమా, 5 సంవత్సరముల వారంటీ కూడా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు.

అతి తక్కువ డౌన్‌పేమెంట్ పథకంలో భాగంగా కేవలం మరికొన్ని వాహనాలను అందిస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ వడ్డీ రేటు, పాత 2 వీలర్‌కు ఎక్స్ఛేంజిలో మార్కెట్ ధరకంటే అధిక ధర, చెక్కులు లేకుండానే ఫైనాన్స్ సౌకర్యం, స్పాట్ ఎక్స్ఛేంజ్, స్పాట్ ఫైనాన్స్, స్పాట్ అప్రూవల్ సదుపాయాలు కలవన్నారు.



# హిందూ ధర్మ పరిరక్షణకు యువత నడుంకట్టాలి

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి
- చాతుర్మాస దీక్ష అనంతరం విశాఖ రాక
- స్వాగతం పలికిన శంకర సేన సేవ ట్రస్ట్ సభ్యులు



విశాఖ సిటీ : నేటి పరిస్థితులలో మన సమాజం పరదేశీ సంస్కృతి మోజులోపడి దారితప్పుతోందని, హిందూ సమాజాన్ని సరియైన దారిలో నడిపించాలంటే యువత నడుంకట్టాలని, హిందువులంతా ఆధ్యాత్మిక భావనతో సమాజ ఉద్ధరణకు పాటుపడాలని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. రుషీకేష్‌లో చాతుర్మాస్య దీక్ష ముగించుకుని విశాఖకు చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో మహాస్వామికి విశాఖ శంకర సేన సేవ ట్రస్టు సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ తాను గంగాతీరంలో ప్రతి నిత్యం స్నానమాచరించి అనంతరం శారదాచంద్రమౌళీశ్వరులకు అభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. తరువాత శంకరభాష్యం పాఠాలను శిష్యులకు, భక్తజనులను బోధించేవారు. సాధుసంతులకు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బండారాలను నిర్వహించేవారమన్నారు. స్వామి వారితోపాటు ఉత్తర పీఠాధిపతి బాలస్వామి, శంకర సేన సేవ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. పీఠానికి చేరుకున్న సభ్యులు ఇటీవల కేరళలో సంభవించిన ప్రకృతివిపత్తు బాధితులకు బట్టలు, తినుబండారాలు, ఇతర సహాయ సహకారాలందజేశారు. విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా ట్రస్టీలు ఎన్ సుబ్బారావు, రొబ్బి శ్రీనివాస్, శంకర సేన సేవ ట్రస్టు సభ్యులు సూరిబాబుతోపాటు ఉత్తర నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు, డాక్టర్ బొగ్గు శ్రీను, మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, బొగ్గు శ్రీను మిత్రమండలి సభ్యులు పలువురు హాజరై స్వామివారి ఆశీస్సులు గైకొన్నారు.



హిమాలయ పాదప్రాంతమైన రుషీకేశ్‌లో చాతుర్మాస్య దీక్షను ముగించుకుని విశాఖ శ్రీ శారదా పీఠానికి విచ్చేయుచున్న షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారికి విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికి, గజమాలతో సత్కరిస్తున్న మహాస్వామి ఆశీర్వచనం పొందుతున్న ఉత్తర నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ బొగ్గు శ్రీను, వైఎస్ఆర్ సీపీ 69వ వార్డు అద్యక్షుడు దాసరి రాజు, తదితరులు



# రూపాయికి ఆర్‌బీఐ షాక్!

## మొట్టమొదటిసారి 74 స్థాయికి రూపాయి పతనం

ముంబై : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్లను సర్‌ప్రైజ్ చేస్తూ.. రెపో రేటును యథాతథంగా ఉంచడం రూపాయిని తీవ్రంగా దెబ్బకొట్టింది. ఆర్‌బీఐ పాలసీ ప్రకటన అనంతరం వెంటనే రూపాయి అత్యంత కనిష్ట స్థాయి 74 కు పతనమైంది. డాలర్ మారకంలో రూపాయి మరోసారి చారిత్రాత్మక కనిష్ట స్థాయిని తాకింది. నేడు ట్రేడింగ్ ప్రారంభంలోనే డాలరు మారకంలో రూపాయి భారీగా నష్టపోయింది. గత కొన్ని రోజులుగా కూడా రూపాయి ఈ విధంగానే ట్రేడవుతూ వస్తోంది.

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటంతో, రూపాయిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750







# రాజ్‌కోట్ టెస్టులో రెండోరోజూ భారత్‌దే హవా..!

న్యూఢిల్లీ : రాజ్‌కోట్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో వరుసగా రెండో రోజు కూడా భారత్ జట్టు పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించింది. కెప్టెన్ విరాట్ కోహ్లి (139: 230 బంతుల్లో 10x4), పృథ్వీ షా (134: 154 బంతుల్లో 19x4), రవీంద్ర జడేజా (100 నాటౌట్: 132 బంతుల్లో 5x4, 5x6) సెంచరీలతో కదం తొక్కడంతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ని 649/9 వద్ద డిక్లేర్ చేసిన భారత్ జట్టు.. ఈరోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్‌ని 94/6తో ఆత్మరక్షణలోకి నెట్టింది. ఆ జట్టు ఇంకా 555 పరుగులు తొలి ఇన్నింగ్స్‌లో వెనకబడి ఉండగా.. మ్యాచ్‌లో మరో మూడు రోజులు ఆట మిగిలి ఉంది. భారత బౌలర్లలో మహ్మద్ షమీ రెండు, అశ్విన్, జడేజా, కుల్దీప్ తలో వికెట్ పడగొట్టగా.. హెట్‌మయర్ని జడేజా రనౌట్ చేశాడు. ఆటలో రెండో రోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 364/4తో భారత్ తొలి ఇన్నింగ్స్‌ని కొనసాగించిన విరాట్ కోహ్లి - రిషబ్ పంత్ జోడీ.. బౌండరీల మోత మోగించింది. ముఖ్యంగా.. యువ హిట్టర్ పంత్ (92: 84 బంతుల్లో 8x4, 4x6), ఆకాశమే హద్దుగా విండీస్ బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కి అభేద్యంగా 133 పరుగుల భాగస్వామ్యం నెల కొల్పగా.. విరాట్ కోహ్లి కెరీర్‌లో 24వ శతకాన్ని నమోదు చేసు కున్నాడు. అయితే.. సెంచరీకి చేరువైన రిషబ్ పంత్ పేలవ షాట్‌తో 92 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటవగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే కోహ్లి, అశ్విన్ (7) పెవిలియన్ చేరిపోయారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com